క్లుప్తంగా

విద్యుత్ ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: మరమ్మతుల నిమిత్తం నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ గౌలిగూడ, ఉస్మాన్‌గంజ్, ఫీల్‌ఖానా విద్యుత్ ఫీడర్ల పరిధిలోని అశోక్‌బజార్, నేషనల్ హోటల్, తారా ఇంటర్నేషనల్ హోటల్, అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్, సీనా హోటల్ కాంప్లెక్స్, అన్నపూర్ణ కాంప్లెక్స్, అజీజ్ ప్లాజా, రంగాచారి, ప్రేమ్ ప్లాజా, బీఎస్ఏఆర్ తదితర ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. 11కేవీ పురాణాపూల్ ఓవర్ హెడ్ ఫీడర్ పరిధిలోని జుమ్మేరాత్ బజార్, ఎంసీహెచ్, సీత్లామాతా, భూలక్ష్మి దేవాలయం, బాపూజీనగర్, మార్వాడీ స్కూల్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.

నేడు రవీంద్రభారతిలో 'తెలుగు పాట సినీ సుస్వరాలు'

గన్‌ఫౌండ్రీ: శృతిలయ ఆర్ట్స్ అకాడమీ, సీల్‌వెల్ కార్పొరేషన్, ఆర్ఆర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన రవీంద్రభారతిలో మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు పాట సినీ సుస్వరాలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీల్‌వెల్ కార్పొరేషన్ ఎండీ బండారి సుబ్బారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి హోం మంత్రి మహమూద్‌అలీ, ఎమ్మెల్సీ మధుసుదనాచారి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దామోదర్‌గుప్తాతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు.

దరఖాస్తు గడువు పెంచాలని వినతి



టీఎస్‌పీఎస్‌సీ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న వినోద్‌కుమార్

గన్‌ఫౌండ్రీ: గ్రూప్–2 నోటిఫికేషన్ దరఖాస్తు గడువు పొడిగించాలని తెలంగాణ జన సమితి విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ వినోద్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రెండు మూడు రోజులుగా వివిధ కారణాలతో సాంకేతిక సమస్యలు తలెత్తాయని, మానవీయ కోణంలో ఆలోచించి దరఖాస్తు గడువు పెంచాలని కోరారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

'నిద్రావస్థలో జీహెచ్‌ఎంసీ అధికారులు'



రవీందర్

అబిడ్స్: కుక్కల దాడిలో బాలుడు చనిపోయినా ప్రభుత్వం స్పందించడం లేదని నగర మార్కెటింగ్ మాజీ డైరెక్టర్, రాష్ట్ర పీసీసీ నాయకుడు జె.రవీందర్ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ నగరాన్ని కుక్కల నగరంగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. మంగళవారం కుక్కల దాడిలో ఓ బాలుడు మృతిచెందగా బుధవారం సైతం నగరంలో కుక్కల దాడులు కొనసాగాయన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు నిద్రావస్థలో ఉన్నారని విమర్శించారు. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ కేవలం ప్రచారానికే పరిమితమయ్యారని, ఒక్కరోజు అయినా నగరంలో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారా అని రవీందర్ ప్రశ్నించారు. కుక్కల దాడిలో మరణించిన బాలుడి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన

గోల్కొండ: ఆహార అలవాట్లు, జీవనశైలి విధానంతో గుండె జబ్బులు పెరిగిపోతున్నాయని ప్రముఖ ఇంటర్‌వెన్షనల్ కార్డియాలజిస్ట్ నవీన్ కుమార్ అన్నారు. బుధవారం గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హృద్రోగ శస్త్ర చికిత్సలలో వచ్చిన పద్ధతులు, వాటిని ఉపయోగించే విధానాలను వివరించారు. గుండెపోటుతో మరణించే వారి సంఖ్య పెరిగిపోతుందని, హార్ట్ స్ట్రోక్‌కు గురైన వారికి సకాలంలో చికిత్స అందిస్తే వారి ప్రాణాలను రక్షించవచ్చని ఆయన అన్నారు. డాక్టర్ విశాల్, గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా, ఆర్ఎంఓ డాక్టర్ ఖాజా మహ్మద్ రవూఫ్ ఉద్దీన్ పాల్గొన్నారు.



మినీ బస్సులెక్కడ..?

పాతబస్తీలో కనిపించని మినీ బస్సులు

- గతంలో ఉన్న వాటిని నిలిపివేసిన ఆర్టీసీ అధికారులు
- పెద్ద బస్సులు సైతం అవసరమైన మేర లేని వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

చార్మినార్: గతంలో అధిక సంఖ్యలో నడిచిన ఆర్టీసీ బస్సులు ప్రస్తుతం చాలా రూట్లలో తగ్గిపోయాయి. రెవెన్యూ రావడం లేదనే కారణంతో ఆర్టీసీ బస్సుల ట్రిప్పులను అధికారులు తగ్గించారు. కొన్ని రూట్లలో పూర్తిగా తొలగించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో పాతబస్తీతో పాటు నగరంలో తిరిగేందుకు చార్మినార్ వద్ద కొత్త మినీ బస్సులను ఘనంగా ప్రారంభించారు. కొన్ని రోజుల పాటు పాతబస్తీలోని అంతర్గత రోడ్లలో సైతం మినీ బస్సులు నడిపారు. ఎంతో మంది విద్యార్థులతో పాటు ఉద్యోగులు, వ్యాపారులకు ఈ మినీ బస్సులు సౌకర్యంగా మారాయి. రానురాను వీటి ట్రిప్పులను తగ్గించిన అధికారులు ప్రస్తుతం పాతబస్తీలో కనిపించకుండా పోయాయి. ఇటీవల నగరంలో మూడు కొత్త డబుల్ డెక్కర్ బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చిన ప్రభుత్వం పాతబస్తీ ప్రజల కోసం కనీసం మినీ బస్సులను తిరిగి నడపాలని కోరుతున్నారు.



మినీ బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు(ఫైల్)

కొన్నిచోట్ల బస్సు సౌకర్యం నిల్..

బస్తీల్లో మినీ బస్సులను పూర్తి స్థాయిలో నడపడంలో ఆర్టీసీ అధికారులు విఫలమవుతున్నారు. ఇరుకైన రోడ్లు, మూల మలుపులున్న రహదారుల్లో సైతం పెద్ద బస్సులనే నడుపుతుండడంతో ట్రాఫిక్ సమస్యలతో పాటు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పాతబస్తీలోని అంతర్గత బస్తీల్లో కొన్నింటికి బస్సు సౌకర్యం లేక పోగా, మరికొన్ని బస్తీలకు పెద్ద బస్సులను నడుపుతున్నారు. ఒకటి రెండు చోట్ల మాత్రమే మినీ బస్సులు అందుబాటులో ఉన్నాయి. అంతర్గత బస్తీల్లోని ప్రయాణికులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన మినీ బస్సులు ఆశించిన ఫలితాలను సాధించడం లేదు. ఈ బస్సులను గల్లీల్లో కాకుండా ప్రధాన రోడ్లలో మాత్రమే నడపడానికి సంబంధిత అధికారులు ఆసక్తి చూపుతున్నారు.

పెద్ద బస్సులతో సమస్యలు..

చిన్న రోడ్లలో పెద్ద బస్సులు నడిపేందుకు ఆర్టీసీ సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనాల రద్దీతో బస్సులు ముందుకు కదిలేందుకు ఎక్కువ సమయం పడుతోంది. దీంతో పాటు వాహనదారులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరచూ ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయి. పాతబస్తీలోని అంతర్గత బస్తీలన్నింటికి మినీ బస్సులు నడుపుతున్నామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి మినీ బస్సులు నడపాలని పాతబస్తీ ప్రజలు కోరుతున్నారు.

అధికారులు కాలనీల్లో పర్యటించాలి

ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా తమ పరిధిలోని ప్రాంతాల్లో పర్యటిస్తూ ఉండాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన టోలిచౌకిలోని తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు కాలనీలు, బస్తీల్లో పర్యటిస్తే ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. అలా చేయడం వల్ల ప్రజలు సైతం అధికారులను గౌరవిస్తారన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, రంజాన్ నెల ప్రారంభానికి ముందే వాటిని పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న డ్రైనేజీ పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేస్తే రోడ్డు పనులు ప్రారంభించే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రంజాన్ మాసంలో మార్కెట్‌లు రద్దీగా ఉంటాయని, రోడ్డు పనులు అసంపూర్తిగా ఉంటే స్థానికులతో వ్యాపారులు సైతం ఇబ్బందులు పడతారన్నారు. తాగునీటి సరఫరా విషయంలోనూ అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఆయన అధికారులకు సూచించారు. లోప్రెషర్ సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి పరిష్కార చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులను ఆదేశించారు. మహ్మద్ నసీరుద్దీన్, జలమండలి డీజీఎం ఖాజా జవహర్ అలీ, మజ్లిస్ నాయకులు అలీమొద్దీన్, హారూన్ ఫరాన్, బదర్ ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష పరిరక్షణకు కృషి చేయాలి



పురస్కార గ్రహీతలతో శ్రీనివాస్‌గుప్తా తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలుగు భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం, నిర్వహించి తెలుగు భాష సాహిత్య పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాతృభాషతో చిన్నారులకు ఉండే అనుబంధం వారి మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. సమాజహితానికి అవసరమైన రచనలు రావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పలువురు కవులు, రచయితలను సన్మానించారు. కార్యక్రమంలో సమాజ సేవకుడు డాక్టర్ హరినారాయణరెడ్డి, పినాకిని అసోసియేషన్ అధ్యక్షుడు కె.మురళీమోహన్‌రాజు, ఎస్.రాంచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి



మంత్రి తలసానికి వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ నాయకులు

అబిడ్స్: గోడేకబర్‌లోని డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను నగర గ్రంధాలయ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇక్కడ సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే స్థానికులకు ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారని, సంబంధిత అధికారులు కెమెరాలను ఏర్పాటు చేసేలా ఆదేశిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బస్తీ కమిటీ నాయకులు చరణ్, అశోక్ నరహరి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సుల్తాన్‌బజార్: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం(టీఎస్‌జీఆర్ఈఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా దామోదర్‌రెడ్డి ఎన్నికయ్యారు. అబిడ్స్‌లోని రెడ్డి హాస్టల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎన్నిక నిర్వహించారు. మిగిలిన సభ్యులను ఏగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేట్ అధ్యక్షుడిగా విశ్వనాథం, ఉపాధ్యక్షులుగా జి.మోహన్‌రెడ్డి, జి.శ్రీనివాస్‌రెడ్డి, మోహన్, శ్రీహరిరెడ్డి, సీతారామయ్య, భాగ్యలక్ష్మి తదితరులు ఎన్నికయ్యారు.

నిందితుడికి జైలు శిక్ష

గోల్కొండ: ఓ కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తికి న్యాయస్థానం శిక్ష విధించింది. గోల్కొండ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. రాయదుర్గానికి చెందిన మహ్మద్ రఫీక్(41) 2014లో గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఒక నేరంలో నిందితుడిగా ఉన్నాడు. బుధవారం 7వ మెట్రో పాలిటన్ సెషన్ జడ్జి కె.జైకుమార్ మహ్మద్ రఫీక్‌కు 5 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.3 వేల జరిమానా విధించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

'దళితుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతోంది'

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర ప్రభుత్వం దళితుల పట్ల వివక్ష చూపుతుందని అఖిల భారత అంబేడ్కర్ యువ జన సంఘం గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు దినేష్‌కుమార్ అన్నారు. ఐదుసార్లు శాసన సభ్యుడిగా ఎన్నికైన దళిత ఎమ్మెల్యే జి.సాయన్న అంత్యక్రియలను అధికార లాంచనాలతో నిర్వహించకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. బుధవారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దళిత ఎమ్మెల్యే పట్ల సీఎం కేసీఆర్ వ్యవహరించిన తీరు సరికాదన్నారు. రాబోయే ఎన్నికల్లో ఇందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో సంఘం గన్‌ఫౌండ్రీ ఇన్‌చార్జ్ డి.సుధాకర్, అధ్యక్షుడు ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని లాభాల్లోకి తెచ్చేందుకు కృషి



ఉద్యోగులకు క్యాష్ ప్రైజ్ అందజేస్తున్న ఆర్ఎం వరప్రసాద్

చాంద్రాయణగుట్ట: ఆర్టీసీని లాభాల బాటలోకి తీసుకొచ్చేలా సిబ్బంది కృషి చేయాలని టీఎస్ఆర్టీసీ హైదరాబాద్ రీజనల్ మేనేజర్ బి.వరప్రసాద్ సూచించారు. బుధవారం ఆయన ఫలక్‌నుమా డిపోలో తనిఖీలు చేశారు. అనంతరం విధుల్లో ప్రతిభ కనబరిచిన డ్రైవర్, కండక్టర్లకు నగదు అవార్డు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికులతో సిబ్బంది మర్యాదతో నడుచుకోవాలన్నారు. డ్రైవర్లు ప్రమాదాలకు తావులేకుండా సంస్థపై మరింత నమ్మకం కుదిరేలా వ్యవహరించాలని సూచించారు. ఇంధన పొదుపు పాటించి ఖర్చులు తగ్గించాలన్నారు. సంస్థ అభివృద్ధికి పాటు పడే సిబ్బంది సేవలను గుర్తిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీఎం జాకీర్ హుస్సేన్, క్యాష్ అవార్డు తీసుకున్న ఉద్యోగులు మహ్మద్ షఫీ అహ్మద్, జె.శ్రీనివాస్, కె.నరేష్, మహ్మద్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అబిడ్స్: స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి విద్యాశాఖ మంత్రి భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి వేడుకలు గాంధీభవన్‌లో నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు కుమార్‌రావు, రాములునాయక్, ఎస్.పి.క్రాంతికుమార్ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కుస్తీ పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: కుస్తీ క్రీడ పట్ల యువకులు మక్కువ చూపుతున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. ఛత్రపతి శివాజీ, కేసరి, దేవర కరుణాకర్ మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుస్తీ పోటీల విజేతలకు బుధవారం ఆయన బహుమతులు అందించారు. గుడిమల్కాపూర్ తాళ్ల గడ్డ స్టేడియంలో జరిగిన ఈ పోటీలలో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి మల్లయోధులు పాల్గొన్నారు. వివిధ విభాగాలలో గెలుపొందిన వారితో పాటు అత్యంత చాకచక్యంతో పోటీ పడిన జూనియర్ క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా దేవర శ్రీనివాస్ మాట్లాడుతూ.. వచ్చే సంవత్సరం నుంచి ఈ పోటీలను రాష్ట్ర స్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, విజేతలకు నగదు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు దేవర వంశీ, కాంగ్రెస్ నాయకుడు కురకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

విజయనగర్‌కాలనీ: ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన బుధవారం హుమాయూన్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్ ఉప్పర్‌పల్లి హ్యాపీహోమ్స్‌లో నివసించే రికార్డో సీజర్(58) ఏసీ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం ద్విచక్రవాహనంపై ఖైరతాబాద్ వెళ్తుండగా మెహిదీపట్నం సరోజినీదేవి కంటి ఆస్పత్రి వద్ద రాజేంద్రనగర్ డిపోకు చెందిన బస్సు ఢీకొట్టింది. దీంతో అతడి తలపై నుంచి వెనుక టైరు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి కుమారుడు ఔరెలియస్ సీజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

'ప్రభుత్వం ప్రజల ఆదరణ కోల్పోయింది'



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

గోల్కొండ: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల ఆదరణ కోల్పోయిందని ఓబీసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్ అన్నారు. బుధవారం గుడిమల్కాపూర్ తాళ్లగడ్డ ఉప్పరిబస్తీలో ఆర్యసమాజ్ శక్తి కేంద్రం ఆధ్వర్యంలో ప్రజా గోస–బీజేపీ భరోసా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతితో ప్రజలు విసిగిపోయారన్నారు. ముఖ్యమంత్రి ప్రగతి భవన్‌కే పరిమితమై నియంతలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ భారీ మెజార్టీతో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పార్టీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ టి.అమర్‌సింగ్, బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, గోవర్ధన్, కట్ల అశోక్, రక్షిత్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కేంద్రం ఏర్పాటు



చార్మినార్: వేసవికాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు జలమండలి ఆధ్వర్యంలో ఉచిత తాగునీటి పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కుంభ మేళా, అశోక్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పంకజ్‌కుమార్ అగర్వాల్ అన్నారు. ప్రజల సౌకర్యార్థం రికాబ్‌గంజ్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ఉచిత తాగునీటి పంపిణీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఏటా జల్ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది సైతం ఏర్పాటు చేసి ప్రతిరోజూ ప్రజలకు ఉచితంగా తాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు.

కుస్తీ క్రీడను ప్రభుత్వం ప్రోత్సహించాలి

జియాగూడ: దేశీయ క్రీడల్లో ఒకటైన కుస్తీ క్రీడను ప్రభుత్వం ప్రోత్సహించాలని కాకతీయ స్కూల్ డైరెక్టర్ కె.అనిల్‌కుమార్ కోరారు. బుధవారం కాకతీయ స్కూల్‌లో ఇటీవల నిర్వహించిన ఛత్రపతి శివాజీ కేసరి రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థి చరణ్‌ను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ..చరణ్ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ జె.కోటేశ్వరరావు, ఎం.నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



చరణ్‌ను సత్కరిస్తున్న స్కూల్ డైరెక్టర్ అనిల్‌కుమార్

'డాగ్ విభాగం సిబ్బందితో ప్రయోజనం లేదు'

అఫ్జల్‌గంజ్: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే జీహెచ్‌ఎంసీ డాగ్ సెక్షన్ సిబ్బందిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు వి.నర్సింగ్‌రావుతో కలిసి ఆయన మాట్లాడారు. ఇటీవల అంబర్‌పేటలో కుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోయిన బాలుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోకపోవడం విచారకరమన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో వీధి కుక్కలను నియంత్రించేందుకు ప్రత్యేకంగా డాగ్ సెక్షన్ అధికారి, సర్కిళ్ల వారీగా స్థాయి సిబ్బంది, వాహనాలు అందుబాటులో ఉన్నప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని ఉస్మానియా, గాంధీ, నీలోఫర్, కింగ్‌కోఠి, ఈఎన్‌టీ, సరోజిని, పేట్లాబుర్జు, కోఠి ప్రసూతి ఆస్పత్రుల పరిసర ప్రాంతాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయన్నారు. జనం ఎక్కువగా ఉండే ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్ తదితర ప్రదేశాల్లో సంచరించే కుక్కలను నిర్బంధించాలని ఆయన కోరారు.

ఆస్పత్రిలో గర్భిణి మృతి.. కుటుంబ సభ్యుల ఆందోళన

దూద్‌బౌలి: పాతబస్తీ బండ్లగూడ గౌసనగర్‌కు చెందిన సనా బేగం(24) ఓ ఆస్పత్రిలో బిడ్డకు జన్మనిచ్చి మృతిచెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే సనా బేగంతో పాటు శిశువు సైతం మృతిచెందిందని ఆరోపిస్తూ ఆమె భర్త రెహాన్‌తో పాటు బంధువులు ఆందోళనకు దిగారు. మూడు రోజుల క్రితం ప్రసవం కోసం ఆస్పత్రిలో చేరిన ఆమె ఆరోగ్య పరిస్థితి సరిగా లేదని, మంగళవారం రాత్రి శస్త్ర చికిత్స చేయగా శిశువుకు జన్మనిచ్చి గుండెపోటు రావడంతో మృతిచెందిందని వైద్యులు తెలిపారు. ఆస్పత్రి వద్దకు చేరుకున్న చార్మినార్ పోలీసులు వాస్తవ పరిస్థితిని వివరించి ఆమె కుటుంబ సభ్యులను శాంతింపజేశారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందకపోవడంతో ఎలాంటి కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.



కొజ్జా పదాన్ని నిషేధించాలి

- రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలి
- ట్రాన్స్‌జెండర్ల సంఘాలు డిమాండ్

సుల్తాన్‌బజార్: తమ మనోభావాలు దెబ్బతీసేలా కొందరు కొజ్జా అనే పదం వాడుతున్నారని, దానిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పలు ట్రాన్స్‌జెండర్స్ సంఘాలు సభ్యులు అన్నారు. ఈ మేరకు బుధవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్రాన్స్‌జెండర్ సంక్షేమ బోర్డు సభ్యురాలు రచన, ట్రాన్స్‌జెండర్ పీపుల్స్ అసోసియేషన్ ప్రతినిధి మోనాలిసా, ప్రేమజ్యోతి ఫౌండేషన్ ప్రతినిధి అవంతిక, అస్తిత్వం ఫౌండేషన్ ప్రతినిధి విష్ణుతేజ, ట్రాన్స్ ఈక్వాలిటీ సొసైటీ అధ్యక్షురాలు జాస్మిన్‌లు మాట్లాడుతూ.. కొజ్జా అనే పదం వాడడం తమను మరింత వివక్షకు గురిచేసే విధంగా ఉందని వారు అభిప్రాయపడ్డారు. కొజ్జా అనే పదాన్ని నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో ట్రాన్స్‌జెండర్ సంఘాల ప్రతినిధులు నందిత శేఖర్, కృష్ణమ్మ, నీతు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ట్రాన్స్‌జెండర్ల సంఘాల ప్రతినిధులు

కార్మికులకు వేతనాలు పెంచాలని ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహ

సుల్తాన్‌బజార్: నేషనల్ హెల్త్ మిషన్ స్కీమ్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు నాలుగో తరగతి సిబ్బందికి కనీస వేతనాలు అమలు చేయకుండా శ్రమ దోపిడీకి గురిచేస్తున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి, ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నరసింహ అన్నారు. కోఠిలోని కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ.. ఎన్‌హెచ్ఎం స్కీమ్‌లో సరిపడా నిధులు ఉన్నప్పటికీ కార్మికులకు జీతాలు పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఔట్‌సోర్సింగ్ జీఓ ప్రకారం కార్మికులకు రూ.15,600 జీతం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో బాపుయాదవ్, రామకృష్ణ, శేషమ్మ, సమ్మక్క, దేవరాజ్, పండరి, వెంకటలక్ష్మి, పద్మ, సావిత్రి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.